తరంగాలు

రిపోర్టర్లు కావలెను

అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి...

ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్

94949 23460



https://epaper.tharangalu.in

RNI. TELTEL / 2022 / 83463

జాతీయ దిన ప్రతిక

# తరంగాలు

Tharangalu Daily News Paper

ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
సోమవారం
17 ఆగస్టు 2026
సంపుటి 03
సంచిక 308
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh

Epaper: www.tharangalu.in.com


# కేసీఆర్‌ది ఫ్యామిలీ జస్టిస్.. నాది సోషల్ జస్టిస్


- ఎవరేం చేశామో శాసనసభలో తేల్చుకుందాం రండి
- బావ బామ్మర్దులే కాదు.. కేసీఆర్‌నూ తీసుకురావాలి
- 8.11లక్షల కోట్ల అప్పులను వారసత్వంగా ఇచ్చారు
- వాటికి ఏటా 75 వేల కోట్లు వడ్డీలుగా చెల్లిస్తున్నాం
- రైతుల కోసం రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేశాం
- మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నాం
- యువతకు రెండున్నరేళ్లలో 70 వేల ఉద్యోగాలిచ్చాం
- సొంత చెల్లిని ఇంట్లో నుంచి వెళ్లగొట్టిన కేటీఆర్ తెలంగాణ ఆడబిడ్డలకు ఏం న్యాయం చేస్తాడు?
- కొడుకు దుర్మార్గాన్ని సరిదిద్దని వ్యక్తి కేసీఆర్
- పరకాల, ములుగు సభల్లో సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజం



- అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

వరంగల్/ములుగు, ఆగస్టు 16 : మాజీ సీఎం కేసీఆర్ తన పదేళ్ల పాలనలో ఫ్యామిలీ జస్టిస్ చేస్తే.. తాను సోషల్ జస్టిస్ (సామాజిక న్యాయం) చేస్తున్నానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. "ఆనాడు కేసీఆర్ ముఖ్యమంత్రి అయితే తన కొడుకు కేటీఆర్‌ను, అల్లుడు హరీశ్‌ను మంత్రులను చేసుకున్నారు. నేను ముఖ్యమంత్రి కాగానే సీతక్కను, కొండా సురేఖను మంత్రులను చేశాను. కేసీఆర్ ఎర్రబెల్లి దయాకర్‌రావుకు మంత్రి పదవి ఇస్తే.. నేను అడ్లూరి లక్ష్మణ్‌కు మంత్రి పదవి ఇచ్చాను. కేసీఆర్ తన కూతురిని ఎంపీని చేసిండు.. ఓడిపోతే ఎమ్మెల్సీని చేసిండు. నేను కడియం కావ్యను ఎంపీని చేశాను.. యశస్వినిని


➤ మిగతా 2వ పేజిలో..



# రష్యాపై డ్రోన్ దాడి..
# షాకింగ్ వీడియో

హైదరాబాద్, ఆగస్టు 16 : రష్యాలో తాజాగా జరిగిన డ్రోన్ దాడి అక్కడ ప్రకంపనలు సృష్టిస్తోంది. భారీ స్థాయిలో చెలరేగిన మంటల తాలూకు వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. మాస్కో ప్రాంతంలోని ఆన్‌లైన్ రీటెయిలర్ వైల్డ్ బెర్రీస్‌కు చెందిన ఒక గోదాముపై ఆదివారం తెల్లవారుజామున ఈ దాడి జరిగింది. తమకు తెలిసినంత వరకూ ఇటీవల కాలంలో జరిగిన అతిపెద్ద డ్రోన్ దాడి ఇదేనని మాస్కో ప్రాంతీయ గవర్నర్ తెలిపారు.మాస్కోకు దక్షిణాన 45 కిలోమీటర్ల దూరంలోని కొలెడీనో అనే ప్రాంతంలోని వైల్డ్‌బెర్రీస్ సంస్థ గోదాముపై

➤ మిగతా 2వ పేజిలో..



# మెట్రో రైలుకు 'స్వదేశీ' బోగీలు

- భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్‌కు బోగీల తయారీ బాధ్యతలు
- కన్సల్టెంట్‌గా ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్
- సర్కారు ఆదేశాలతో అధికారుల కసరత్తు
- 1200 కోట్లతో 60 కోచ్‌ల కొనుగోలు
- ఇందుకు ప్రత్యేకంగా నిధుల కేటాయింపు
- ప్రస్తుత మెట్రో రైళ్లన్నీ దక్షిణ కొరియావే..

హైదరాబాద్ ఆగస్టు 16 హైదరాబాద్ మెట్రో రైల్‌కు మరికొన్ని నెలల్లో 60 కొత్త బోగీలు రానున్నాయి. 'మేకిన్ ఇండియా- మేడిన్ ఇండియా' నినాదంలో భాగంగా దేశంలోని ప్రముఖ సంస్థల నుంచి ఈ బోగీలను కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వీలైనంత త్వరగా కంపెనీని ఎంపిక చేసి బోగీలను అందుబాటులోకి తీసుకురావాలన్న సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్‌ఎంఆర్‌ఎల్) అధికారులు కసరత్తు చేపట్టారు. హైదరాబాద్ మెట్రో తొలిదశ ప్రాజెక్టు 2017 నవంబరులో అందుబాటులోకి వచ్చింది. 69.2 కిలోమీటర్ల

➤ మిగతా 2వ పేజిలో..




# స్నాతకోత్సవానికి చీఫ్ జస్టిస్‌ను ఆహ్వానించవద్దు.. మరో లా కాలేజీ విద్యార్థుల లేఖ

హైదరాబాద్ ఆగస్టు 16 త్వరలో జరగనున్న స్నాతకోత్సవానికి చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ మనన్ కుమార్ మిశ్రాను ఆహ్వానించవద్దని బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ (ఎన్‌ఎల్‌ఎస్‌ఐయూ) విద్యార్థులు

➤ మిగతా 2వ పేజిలో..

# ఓపిక నశిస్తే..
# జీవన్‌రెడ్డిలా తిరగబడతా

- వనపర్తి ఎమ్మెల్యే డబ్బులతో టికెట్ తెచ్చుకున్నారు
- నా కార్యకర్తలను ఇబ్బంది పెడుతున్నారు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే కలిసి రూ.కోట్లు తిన్నారు
- సొంత పార్టీపై చిన్నారెడ్డి సంచలన వ్యాఖ్యలు
- నేటి నుంచి రాష్ట్రంలో మండల స్థాయి ప్రజావాణి



గోపాల్‌పేట, ఆగస్టు 16 కాంగ్రెస్ సీనియర్ నేత, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. సొంత పార్టీకే చెందిన వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. డబ్బులతో ఎమ్మెల్యే టికెట్ తెచ్చుకొని.. నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను అవినీతి పార్టీగా మార్చారని, తన పనులకు అడ్డుపడుతూ.. తన కార్యకర్తలను ఇబ్బందులకు

➤ మిగతా 2వ పేజిలో..

# నేటి నుంచే సనత్‌నగర్
# ఆస్పత్రిలో వైద్య సేవలు

- టిమ్స్ రెడీ
- ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా సనత్‌నగర్ టిమ్స్
- 1082 పడకలు.. అందులో 300 ఐసీయూ బెడ్స్
- తొలుత ఓపీ సేవలు, నెల తర్వాత సర్జరీలు
- 2 నిమిషాల్లోనే రక్త నమూనాలు టెస్టింగ్ ల్యాబ్‌కు
- 1126 కోట్లతో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మాణం
- 2360 పోస్టులు మంజూరు చేసిన సర్కారు
- సాధారణ రోగులకు నిమ్స్ మాదిరిగానే చార్జీలు



హైదరాబాద్ ఆగస్టు 16 సామాన్య ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌లో నిర్మించిన ప్రతిష్ఠాత్మక డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (డీఆర్‌ఎంసీఆర్ టిమ్స్) నేటి నుంచి ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ ఆస్పత్రిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభించనున్నారు. ప్రభుత్వ రంగంలో ఒకే దశలో నిర్మించిన అతిపెద్ద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా ఇది ప్రత్యేకతను సంతరించుకుంది. మొత్తం రూ.1126 కోట్ల వ్యయంతో 22.6 ఎకరాల విస్తీర్ణంలో, 11.70 లక్షల చదరపు అడుగుల నిర్మిత విస్తీర్ణంతో ఈ సమగ్ర వైద్య సముదాయాన్ని అభివృద్ధి చేశారు. నాలుగు బ్లాకులుగా నిర్మించిన ఈ ఆస్పత్రి 75 శాతం

➤ మిగతా 2వ పేజిలో..



# ఆరుగురు ఇంజనీరింగ్
# విద్యార్థుల మృత్యువాత

- 'పశ్చిమ'లో రెండు వేర్వేరు ఘటనల్లో పెను విషాదం
- అయితంపూడిలో కాలువలోకి దూసుకెళ్లిన కారు
- నలుగురు దుర్మరణం.. ఒకరు గల్లంతు
- వేంద్ర వద్ద కాలువలో స్నానానికి దిగిన మరో ఇద్దరు..
- మృతుల్లో కోనసీమ, పార్వతీపురం వాసులు

➤ మిగతా 2వ పేజిలో..

# కేసీఆర్‌ది ఫ్యామిలీ జస్టిస్.. నాది సోషల్ జస్టిస్

ఎమ్మెల్యేను చేశాను. కేసీఆర్ తన సడ్డకుని కొడుకు సంతోష్ రావును రాజ్యసభకు పంపిస్తే.. నేను మిత్రధర్మంతో వేం నరేందర్‌రెడ్డిని రాజ్యసభకు పంపించాను. కేసీఆర్ వినోద్‌రావును ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్‌ను చేసుకుంటే.. నేను ఉద్యమకారుడు కోదండరాంకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చాను. కేసీఆర్ ముఖ్యమంత్రి అయితే తన కొడుకు కేటీఆర్‌ను పార్టీకి వర్కింగ్ ప్రెసిడెంట్‌ను చేసుకున్నాడు. నేను.. మహేశ్‌గౌడ్‌ను పీసీసీ అధ్యక్షుడిని చేశాను. కేసీఆర్ ముఖ్యమంత్రి అయితే ఆయన కుటుంబానికే లాభం.

కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటే అన్ని వర్గాల ప్రజలకు లాభం" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండ జిల్లా పరకాలలో, ములుగు జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభల్లో మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధిపై చర్చించేందుకు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని హరీశ్‌రావు, కేటీఆర్ కోరుతున్నారని, అయితే సెప్టెంబరులో శాసనసభ నిర్వహిస్తున్నామని, బావబామ్మర్దులే కాకుండా కేసీఆర్‌ను కూడా సభకు తీసుకురావాలని అన్నారు. 'పదేళ్లలో మీరేం చేశారో.. రెండున్నరేళ్లలో ప్రజలకు మేం ఏం చేశామో తేల్చుకుందాం' అని సీఎం సవాల్ చేశారు.

### ధనిక రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు..

కేసీఆర్ పదేళ్లలో పాలనలో ధనిక రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని సీఎం రేవంత్ ఆరోపించారు. రూ.6,500 వేల కోట్ల అప్పు మాత్రమే ఉన్న రాష్ట్రాన్ని.. కేసీఆర్ వచ్చాక అప్పులపాలు చేసి రూ.8.11 లక్షల కోట్ల అప్పులను వారసత్వంగా ఇచ్చారని మండిపడ్డారు. ఆ అప్పులకు వడ్డీ కిందనే ఏటా రూ.75 వేల కోట్లు చెల్లిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు తాను రోజుకు 18 గంటలు పని చేస్తున్నానని, ఏ రోజూ సెలవు తీసుకోలేదని అన్నారు. తమ ప్రభుత్వం రైతుల కోసం రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. కాళేశ్వరాన్ని కూలేశ్వరం చేసినప్పటికీ దేశం లో అత్యధికంగా వరి ధాన్యాన్ని పండిచామని చెప్పారు. 32 నెలల్లో ధాన్యం కొనుగోలుకు రూ.90 వేల కోట్లు రైతులకు చెల్లించామన్నారు. రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తానని ఇచ్చిన మాట ప్రకారం 85 లక్షల మంది రైతులకు రూ.8,617 కోట్లు తొలి విడతలోనే మాఫీ చేశామని వెల్లడించారు.

### మహిళా సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం..

కేసీఆర్ ఐదేళ్లపాటు మంత్రివర్గంలో మహిళలకు చోటు కూడా కల్పించలేదని, తాను మాత్రం కొండా సురే ఖ, సీతక్కను మంత్రులుగా తీసుకున్నానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మహిళల సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. రక్త సంబంధం లేకపోయినా సీతక్కను సొంత సోదరిలా చూసుకుంటున్నానని, కేటీఆర్ మాత్రం జైలుకు వెళ్లివచ్చిన సొంత చెల్లిని ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని బయటకు పంపించారని ఆరోపించారు. కూతురిని బయటకు నెట్టేస్తుంటే కన్నతండ్రి.. ధృతరాష్ట్రుడిలా చూస్తుండిపోయారని విమర్శించారు. తమ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని, తాజాగా పోలీస్, సివిల్ పోస్టులకు నోటిఫికేషన్లు ఇస్తున్నామని తెలిపారు. ఇక నుంచి దశలవారీగా నోటిఫికేషన్లను ఇస్తామన్నారు. కేసీఆర్ కుటుంబం రెచ్చగొడితే యువకులు రెచ్చిపోయి ఆందోళనలు చేయొద్దని, పోలీసు కేసుల్లో ఇరుక్కోవద్దని, తమ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ఇటీవల తెలంగాణ భవన్‌లో రక్తదాన శిబిరం పెట్టి, చివరికి ఆ రక్తాన్ని కూడా ప్రైవేటు ఆస్పత్రులకు అమ్ముకున్నారని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబం తమ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారంచేసి ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఇలాంటి కుట్రలు, కుతంత్రాలు తమను ఏమీ చేయలేవని, వెయ్యి మంది కేసీఆర్‌లు వచ్చినా వెంట్రుక కూడా పీకలేరని అన్నారు.

### సొంత చెల్లిని వెళ్లగొట్టిన కేటీఆర్..

రక్తం పంచుకుని పుట్టిన సొంత చెల్లెలికి ఆస్తిలో భాగం ఇవ్వాల్సి వస్తుందని మెడపట్టి ఇంట్లోంచి తోసేసిన ఘనుడు కేటీఆర్ అని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. సొంత చెల్లికి న్యాయం చేయలేని వ్యక్తి.. రాష్ట్రంలోని రెండు కోట్ల మంది ఆడబిడ్డలకు ఏం న్యాయం చేస్తాడని ప్రశ్నించారు. ములుగు జిల్లా కేంద్రంలో స మీకృత కలెక్టరేట్‌ను ప్రారంభించిన అనంతరం ఏర్పా టు చేసిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. కొడుకు దుర్మార్గంగా ప్రవర్తిస్తుంటే సరిదిద్దాల్సిన తండ్రి మౌనంగా ఉన్నాడంటే.. ఆ నేరంలో కేసీఆర్‌కూ సగం భాగం ఉన్నట్లేనన్నారు. మరోవైపు హరీశ్‌రావు.. రాష్ట్రంలో కరువు రావాలని, వర్షాలు కురవకూడదని, ప్రజలు చనిపోవాలని తమిళనాడు, కర్ణాటక వెళ్లి క్షుద్రపూజలు, చేతబడి చేయిస్తున్నారని ఆరోపించారు. అయితే వారు ఎన్ని పూజలు చేసినా దేవుడు తమ వైపే ఉన్నాడన్నారు. రామప్ప, వేయిస్తంభాల గుడి తరహాలోనే మేడారాన్ని ప్రపంచస్థాయి పర్యాటక క్షే త్రంగా తీర్చిదిద్దామని చెప్పారు. జంపన్నవాగు, మల్లూ రు ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి పొంగులేటి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ తదితరులు మాట్లాడారు.

# ఓపిక నశిస్తే.. జీవన్‌రెడ్డిలా తిరగబడతా

గురి చేస్తున్నారని ఆరోపించారు. తనకు ఓపిక నశిస్తే మరో జీవన్‌రెడ్డిలా మారి తిరగబడతానని హెచ్చరించారు. ఆదివారం వనపర్తి జిల్లా గోపాల్‌పేటలో కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయం ప్రారంభోత్సవానికి చిన్నారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "ఎమ్మెల్యే టికెట్ చిన్నారెడ్డికి ఇవ్వాలని కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ.. రేవంత్‌రెడ్డికి చెప్పారు. ఆయన వద్ద డబ్బు లేకపోతే మీరే ఖర్చు పెట్టుకోవాలని ఆదేశించారు. కానీ, పార్టీలోని ఎన్నికల కమిటీ డబ్బులకు ఆశపడి నాకు టికెట్ ఇవ్వలేదు" అని చిన్నారెడ్డి అన్నారు. వనపర్తిని అవినీతిమయంగా మార్చారని, తాను అభివృద్ధి పనులు చేపట్టాలనుకుంటే ఎమ్మెల్యే తన వారికే పనులు ఇవ్వాలంటూ వాటిని ఆపుతున్నారని ఆరోపించారు. సీఎం శంకుస్థాపన చేసిన ఐటీ టవర్ నిర్మాణం, నర్సింగాయిపల్లి వద్ద పీజీ కేంద్రంలో బాలికలకు రూ.9 కోట్లతో వసతిగృహం, బాలురకు రూ.15 కోట్లతో హాస్టల్ నిర్మాణానికి టెండరు పిలిచారని, కానీ, ఆ పనులు జరగడం లేదని తెలిసి తాను స్వయంగా ఆయా శాఖల మంత్రి, అధికారుల వద్దకు వెళ్లి అడిగానని తెలిపారు. అయితే.. పనులకు ఎమ్మెల్యేనే అడ్డు పడ్డారని, ఆ కాంట్రాక్టర్ తన మనిషి కాదంటూ కాంట్రాక్టు రద్దు చేయించారని వారు చెప్పారన్నారు. గోపాల్‌పేట మండలంలో వ్యవసాయ మార్కెట్‌ను ఎమ్మెల్యే అనుచరుడి కోసం ఎక్కడో అడవిలో నిర్మించారని ఆరోపించారు.

బుద్ధారం చెరువు రైట్ కెనాలే 2018 ఎన్నికల్లో తన కొంప ముంచిందన్నారు. "మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే ఒక ఎక్స్‌కవేటర్, నాలుగు టిప్పర్లు పెట్టుకొని.. ఊరూరా తిరుగుతూ చెరువులకు కాల్వలు తవ్వి.. నీరు ఇచ్చేసరికి జనం చిన్నారెడ్డిని మరిచిపోయారు. ఇద్దరూ కలిసి కోట్లు కోట్లు తిని, ప్రజల నోట్లో డబ్బులు పెట్టి నా రాజకీయంపై దెబ్బ కొట్టారు" అని చిన్నారెడ్డి వాపోయారు. ఈ అక్రమాలపై విజిలెన్స్ అధికారులు వారి ఇళ్లకు కూడా వెళ్లారని, కానీ.. ప్రజా ప్రతినిధులపై చర్యలకు సంకోచిస్తున్నారని చెప్పారు. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నుంచి మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి తెలిపారు. మండల స్థాయిలో తొలిసారి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం కోసం అవసరాన్ని బట్టి రైతు వేదికలను ఉపయోగించుకోవాలని ఎంపీడీవోలకు సూచించారు. ఇందుకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అనుమతి ఇచ్చారని ఒక ప్రకటనలో చిన్నారెడ్డి పేర్కొన్నారు.

# నేటి నుంచే సనత్‌నగర్ ఆస్పత్రిలో వైద్య సేవలు

నీటి పొదుపుతో ఐజీబీసీ గోల్డ్ రేటింగ్ సాధించింది. ఆరు కీలక విభాగాల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా దీన్ని తీర్చిదిద్దారు. ఏఐ ఆధారిత న్యూమాటిక్ ట్యూబ్ వ్యవస్థను దేశంలోనే తొలిసారిగా ప్రభుత్వ రంగంలో నిర్మితమైన ఈ ఆస్పత్రిలో ఏర్పాటు చేయటం విశేషం. ఈ వ్యవస్థ ద్వారా రోగుల నుంచి పరీక్షలు చేసేందుకు సేకరించిన నమూనాలు ఒకటి నుంచి రెండు నిమిషాల్లోనే సంబంధిత పరీక్షా కేంద్రాలకు చేరతాయి. ఆస్పత్రిలోని నాలుగు ప్రధాన బ్లాకుల్లో మొత్తం 31 మేజర్, 6 మైనర్ ఆపరేషన్ థియేటర్లు ఇందులో ఉన్నాయి. డయాగ్నస్టిక్స్ విభాగంలో 17 పాథాలజీ ల్యాబ్‌లు, 12 మైక్రో బయాలజీ ల్యాబ్‌లు, 10 బయో కెమిస్ట్రీ ల్యాబ్‌లు, 5 ప్రత్యేక ల్యాబ్‌లు ఉన్నాయి.

### పూర్తి స్థాయి వైద్య సముదాయం

సాధారణంగా ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధి దశలవారీగా సంవత్సరాలపాటు కొనసాగుతుంటుంది. అందుకు భిన్నంగా టిమ్స్ సనత్‌నగర్‌ను ఒకే దశలో, ఒకే మాస్టర్‌ప్లాన్ కింద సంపూర్ణ సూపర్ స్పెషాలిటీ వైద్య సముదాయంగా ప్రభుత్వం తీర్చిదిద్దింది. ఆస్పత్రిలో మొత్తం 1,082 పడకలు, అందులో 300 ఐసీయూ పడకలు ఉన్నాయి. మొత్తం పడకల్లో దాదాపు 30 శాతం ఐసీయూలకు కేటాయించడం ద్వారా అత్యవసర, క్లిష్ట వైద్య సేవలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఈ ఆస్పత్రి కోసం సర్కారు 2360 పోస్టులను కూడా మంజూరు చేసింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్)కు తెలంగాణ ప్రభుత్వం ఈపీసీ విధానంలో అప్పగించగా ఆ సంస్థ విజయవంతంగా పూర్తి చేసింది. ఈ ఆస్పత్రిలో అత్యంత ప్రత్యేకమైన సాంకేతిక సదుపాయాల్లో ఏఐ ఆధారిత న్యూమాటిక్ ట్యూబ్ వ్యవస్థ ఒకటి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో దేశంలోనే తొలిసారిగా ఈ తరహా వ్యవస్థను ఇక్కడ ఏర్పాటు చేశారు. సీల్డ్ ట్యూబ్‌లు, గాలి ఒత్తిడితో రక్త నమూనాలు, మందులు, వైద్య నివేదికలు, అత్యవసర వినియోగ వస్తువులను వార్డులు, అత్యవసర విభాగం, ల్యాబ్‌లు, ఫార్మసీ, బ్లడ్ బ్యాంక్‌ల మధ్య కేవలం 1-2 నిమిషాల్లో ఈ విధానం ద్వారా తరలించవచ్చు. దీంతో పరీక్షల ఫలితాల కోసం సమయం తగ్గడంతోపాటు కలుషితమయ్యే ప్రమాదం తగ్గుతుంది.

### 6 కీలక విభాగాల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

అవయవ మార్పిడి, కార్డియాక్ సైన్సెస్, ఆంకాలజీ, న్యూరోసైన్సెస్, నెఫ్రాలజీ, ట్రామా కేర్ వంటి ఆరు ప్రధాన రంగాల్లో టిమ్స్‌ను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ప్రభుత్వం తీర్చిదిద్దింది. కిడ్నీ, కాలేయం, గుండె, బహుళ అవయవ మార్పిడి సేవలకు ఇక్కడ అవకాశం ఉంది. ఆధునిక కార్డియోథొరాసిక్ శస్త్రచికిత్సలు, లీనాక్ ఆధారిత రేడియోథెరపీ, 24 గంటల అత్యవసర వైద్య సేవలు, ఐసీయూ బ్యాక్‌పతో 30 క్లినికల్ విభాగాలు అందుబాటులో ఉన్నాయి.

### అత్యాధునిక స్కానింగ్ సదుపాయాలు

ఆస్పత్రిలో 3.0 టెస్లా ఎంఆర్ఐ, 128-స్లైస్ సీటీ స్కానర్, అధునాతన మామోగ్రఫీ యూనిట్, 5 ఎక్స్‌రే యంత్రాలు ఏర్పాటు చేశారు. రోగులతో వచ్చే సహాయకుల కోసం జీ5 అంతస్తుల్లో నిర్మించిన ధర్మశాలలో 200 మందికి వసతి సదుపాయాలున్నాయి. 30 మృతదేహాల సామర్థ్యంతో మార్చురీతో పాటు, కేంద్ర వంటశాల, లాండ్రీ, మెడికల్ ఆక్సిజన్ పైప్‌లైన్ వ్యవస్థలకు ప్రత్యేక బ్లాకులు ఇందులో నిర్మించారు. ఇక్కడ తొలుత ఓపీ సేవలను అందించనున్నారు. ఓపీతో పాటు డే కేర్ సర్జరీలు కూడా చేస్తారు. అంటే ఒకేరోజులో ఆపరేషన్ చేసి డిశ్చార్జి చేస్తారన్న మాట. నెల రోజుల తర్వాత పూర్తిస్థాయిలో ఇన్‌పేషంట్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ నెలరోజులు ఆపరేషన్ థియేటర్ల స్టెరిలైజేషన్, ఫ్యుమిగేషన్ చేయనున్నట్లు వైద్యవర్గాలు తెలిపాయి.

### 75 శాతం నీటి పొదుపు.. ఐజీబీసీ గోల్డ్ రేటింగ్

ఈ ఆస్పత్రి నిర్మాణంలో పర్యావరణహిత సాంకేతికతకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఈ విధానం ద్వారా 75 శాతం నీరు ఆదా అవుతుంది. తగిన సామర్థ్యంతో ఎస్టీపీ, ఈటీపీలు ఏర్పాటు చేసి మురుగునీరు, వ్యర్థ ద్రవాలను ఈ ఆసుపత్రిలో శుద్ధి చేయనున్నారు. వర్షపు నీటిన్నిసకరించి యార్డ్ వాటర్ సంపుల ద్వారా మొక్కలు, గ్రీన్ కారిడార్లకు వినియోగించే విధానం ఇక్కడ అమలుకానుంది. పర్యావరణహిత నిర్మాణం, ఇంధన సామర్థ్య వ్యవస్థల కారణంగా ప్రాజెక్టుకు ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసీ) గోల్డ్ రేటింగ్ లభించింది. నిర్మాణ సమయంలో 35 లక్షల సురక్షిత పని గంటలు నమోదు చేసినట్లు ఎంఈఐఎల్ గ్రూప్ తెలిపింది.

### కీలక చికిత్సలకు కేంద్రంగా...

ఇంత వరకు గుండె జబ్బులు వస్తే గాంధీ, ఉస్మానియాకు లేకపోతే నిమ్స్ ఆస్పత్రులకు పరుగులు తీసేవారు. చిన్న పిల్లల వైద్య సేవలకు కేవలం నిలోఫర్ ఆస్పత్రి మాత్రమే దిక్కయ్యేది. ఇప్పుడు చిన్నపిల్లలతో పాటు పెద్దలకూ గుండె జబ్బులు, మూత్ర, కిడ్నీ సంబంధిత, న్యూరాలజీ, ఆర్థోపెడిక్ చికిత్సలను టిమ్స్ అందించనుంది. ఇంత వరకు నిమ్స్ వరకు పరిమితమైన కీలక అవయవ మార్పిడిలు ఇక నుంచి ఇక్కడ చేయనున్నారు. నిమ్స్ మాదిరిగా టిమ్స్ స్వయంప్రతిపత్తితో సేవలు అందించబోతోంది. పేదలకు ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి సహకారంతో వైద్యం చేయనున్నారు. ఇతరులకు నిమ్స్ మాదిరిగా చార్జీలు వసూలు చేస్తారు.

### ఏయే బ్లాకుల్లో ఏయే సేవలంటే..

బ్లాక్-ఏ: అత్యవసర సేవలు, 15 ఆపరేషన్ థియేటర్లు, 30 ఐసీయూ బెడ్లు, సెంట్రల్ స్టైరైల్ సర్వీస్ విభాగం ఉన్నాయి.

బ్లాక్-బీ: ఓపీ రిజిస్ట్రేషన్, సెంట్రల్ ఫార్మసీ, కార్డియాక్ ఆపరేషన్ థియేటర్, లీనాక్ ఆధారిత న్యూక్లియర్ మెడిసిన్ విభాగం, 2 క్యాథ్‌ల్యాబ్‌లు ఉన్నాయి.

బ్లాక్-సీ: రేడియాలజీ, పాథాలజీ ల్యాబ్‌లు, సాధారణ, ప్రైవేట్ వార్డులు, వీఐపీ సూట్లు ఉన్నాయి.

బ్లాక్-డీ: పరిపాలన, విద్యా విభాగాలతోపాటు 200 మంది కూర్చునే ఆడిటోరియం ఉంది.

ఏర్పాట్లను పర్యవేక్షించిన మంత్రి

సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం టిమ్స్‌ను ప్రారంభించనున్న నేపథ్యంలో ఆస్పత్రి ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదివారం పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు.

# రేపటి గోదావరి బోర్డు భేటీ వాయిదా

అమరావతి, ఆగస్టు 16 గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశం ఊహించి నట్లుగానే వాయిదా పడింది. కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలోని సాంకేతిక సలహా కమిటీ (టీఏసీ) ఇచ్చిన క్లియరెన్సులకు భిన్నంగా గోదావరి నదిపై అనుమ తుల్లేకుండా తెలంగాణ చేపడుతున్న ప్రాజెక్టులపై మంగళవారం (ఈనెల 18 తేదీ)నాటి చర్చల అజెండాలో చేర్చాలని ఆంధ్రప్రదేశ్ పట్టుబట్టింది. ప్రధానంగా గోదావరి నదిపై సీతారామ ఎత్తిపోతల, తుపాకులగూడెం వద్ద సమ్మక్క సాగర్ ప్రాజెక్టు, కాళేశ్వరం ఎత్తిపోతల నుంచి అదనంగా ఇంకో టీఎంసీ జలాలను వినియోగించుకునేందుకు తెలంగాణ చేస్తున్న ప్రయత్నాలు, తుమ్మిడిహట్టి బ్యారేజీ ద్వారా 20 టీఎంసీల నుంచి 80 టీఎంసీలు, వార్ధా ప్రాజెక్టు ద్వారా 20 టీఎంసీలు తరలించుకునేందుకు ఆ రాష్ట్రం చేస్తున్న ప్రయత్నాలపైనా భేటీలో చర్చించాలని స్పష్టం చేసింది. దరిమిలా చర్చల అజెండాలో ఈ ప్రాజెక్టులను గోదావరి బోర్డు చేర్చింది. దీనిపై తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. తాము చేపట్టిన ప్రాజెక్టులపై చర్చించే అధికారం జీఆర్ఎంబీకి లేదని వాదించింది. దీంతో బోర్డు ఏకంగాసమావేశాన్నే వాయిదా వేసుకుంది.

# రష్యాపై డ్రోన్ దాడి.. షాకింగ్ వీడియో

ఈ దాడి జరిగింది. డ్రోన్ దాడి అనంతరం భారీ ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. అగ్నిపర్వతం బద్దలైనట్టు దట్టమైన పొగలు మిన్నంటాయి. డోమోడిడోవో ప్రాంతంలోని మరో గోదాముపై కూడా దాడి జరిగినట్టు తెలుస్తోంది.శనివారం రాత్రి రష్యాపై ఉక్రెయిన్ భారీ స్థాయిలో డ్రోన్ దాడికి దిగినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అనేక డ్రోన్స్‌ను మార్గమధ్యంలోనే అడ్డుకున్నామని రష్యా ప్రకటించింది. మొత్తం 822 డ్రోన్స్‌ను ధ్వంసం చేశామని రష్యా రక్షణ శాఖ తెలిపింది. మాస్కో దిశగా 600 డ్రోన్స్ వచ్చాయని నగర మేయర్ తెలిపారు.

వైల్డ్ బెర్రీస్ సంస్థకు రష్యా అమెజాన్‌గా పేరుంది. ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసిన వారికి రకరకాల వస్తువులను భారీ స్థాయిలో డెలివరీ చేస్తుంటుంది. అయితే, వైల్డ్‌బెర్రీస్ సంస్థ సాయంతో మిలిటరీ సామగ్రిని రష్యా తరలిస్తోందని ఉక్రెయిన్ కొంతకాలంగా ఆరోపిస్తోంది. గతంలో పలుమార్లు వైల్డ్ బెర్రీస్ సంస్థ గోదాములను ఉక్రెయిన్ టార్గెట్ చేసింది. రష్యా మాత్రం ఈ ఆరోపణలను పలుమార్లు ఖండించింది.

# మెట్రో రైలుకు 'స్వదేశీ' బోగీలు

పొడవున ఎల్‌బీనగర్-మియాపూర్, జేబీఎ?స-ఎంజీబీఎస్, నాగోల్-రాయదుర్గం మూడు కారిడార్లలో మెట్రో రైళ్లు తిరుగుతున్నాయి. అన్ని మార్గాల్లో కలిపి ప్రస్తుతం రోజుకు 1,200 ట్రిప్పుల్లో సగటున 4.6 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. క్రమంగా మెట్రో రైళ్లలో ప్రయాణికుల రద్దీ పెరుగుతోంది. దీంతో 60 కొత్త కోచ్‌లను కొనుగోలు చేసి మెట్రో రైళ్లకు అనుసంధానం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం 57 రైళ్లు ఒక్కోటీ 3 బోగీలతో నడుస్తున్నాయి. ఇకపై మరో కోచ్‌ను అదనంగా జతచేయనున్నారు. ఒక్కో కోచ్‌కు సుమారు రూ.20 కోట్ల చొప్పున 60 బోగీలకు రూ.1,200 కోట్లు ఖర్చవనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు ప్రత్యేక నిధులు సమకూర్చనున్నట్టు హెచ్ఎంఆర్ఎల్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

# ఆరుగురు ఇంజనీరింగ్ విద్యార్థుల మృత్యువాత

ఇరగవరం, పాలకోడేరు, ఆగస్టు 16 సంతోషంగా పెళ్లి వేడుకకు వెళ్లిన విద్యార్థులు తిరుగు ప్రయాణంలో అర్థంతరంగా కన్నుమూశారు. వర్షంలో రోడ్డు మలుపు కనిపించకపోవడంతో వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లడంతో ఈ ఘోరం జరిగింది. పశ్చిమ గోదావరి జిల్లా ఇరగవరం మండలం అయితంపూడిలో ఆదివారం తెల్లవారుజామున ఈ ఘటనలో నలుగురు మృత్యువాతపడగా మరొకరు గల్లంతయ్యారు. మరో ఘటనలో సరదాగా కాలువలో స్నానానికి ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. ఆచంట మండలం వల్లూరుతోటకు చెంది న మట్టా సంతోష్, అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం మోరి, మోరిపోడు, శృంగవరప్పాడు కు చెందిన పోతుల లక్ష్మీభాను వికాస్ (18), నాగిరెడ్డి దుష్యంత్‌సాయి (18), నాగబత్తుల తేజ సాయి సూర్య (19), చెరుకూరి రాజా రాంచరణ్ (16), వీరమల్లు సాయి వెంకట కిరణ్ (18) శనివారం రాత్రి పెరవలిలో జరిగిన స్నేహితుడి సోదరుని వివాహానికి హాజరయ్యారు. అనంతరం ఇరగవరం మండలం ఓగిడిలో పెళ్లికొడుకు నివాసానికి వచ్చిన వీరంతా తిరిగి అర్థరాత్రి దాటిన తర్వాత కారులో ఇంటికి బయలుదేరారు. ఓగిడి నుంచి అయితంపూడి వెళ్లేదారిలో వర్షం కారణంగా మలుపును గమనించక పోవడంతో కారు అదుపుతప్పి పెరవలి-నరసాపురం మెయిన్ కాలువలోకి దూసుకెళ్లింది. మట్టా సంతోష్‌ను స్థానికులు రక్షించి బయటకు తీసుకువచ్చారు. మిగిలిన ఐదుగురు గల్లంతయ్యారు. ఎస్‌డీఆర్ఎఫ్, గజ ఈతగాళ్ల సాయంతో పోలీసులు, రెవెన్యూ, ఫైర్ సిబ్బంది ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం సమయానికి దుష్యంత్‌సాయి, లక్ష్మీభా ను వికాస్, వెంకట కిరణ్, తేజ సాయిసూర్య మృతదేహాలను వెలికితీశారు. చెరుకూరి రాజా రాంచరణ్ కోసం గాలిస్తున్నారు. వీరంతా నరసాపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నారు.

### కాలువలో స్నానానికి దిగి..

రెండు రోజులపాటు సెలవులు కావడంతో పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో చదువుతున్న ఆరుగురు విద్యార్థులు ఆదివారం సాయంత్రం పాలకోడేరు మండలం వేంద్ర జీఎండ్‌వీ కెనాల్ నుంచి విడువడిన అడవికోడు (సబ్ కెనాల్)లో స్నానం చేసేందుకు వెళ్లారు. పార్వతీపురానికి చెందిన శ్రేష్టి రాహుల్ (21) ముందుగా కాలువలోకి దిగి మునిగిపోయాడు. రాహుల్‌ను రక్షించేందుకు భీమవరానికి చెందిన స్నేహితుడు పెరుమాళకల సత్యభాస్కర విఘ్నేష్ (21) కాలువలోకి దిగాడు. ప్రవాహ వేగానికి అతడూ మునిగిపోయాడు. సమాచారం అందుకున్న పాలకోడేరు పోలీసులు, ఫైర్ సిబ్బంది వెంటనే వచ్చి కాలువలో గాలించి ఇద్దరు మృతదేహాలనూ వెలికితీశారు.

# స్నాతకోత్సవానికి చీఫ్ జస్టిస్‌ను ఆహ్వానించవద్దు..

## మరో లా కాలేజీ విద్యార్థుల లేఖ

లేఖ రాశారు. నల్సార్ యూనివర్సిటీ విద్యార్థులకు సంఘీభావంగా ఈ నిర్ణయం తీసుకున్నామని వారు తమ లేఖలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీసీఐ చైర్మన్ తీరును విమర్శించారు.ఇది దేశంలో శక్తిమంతమైన వ్యవస్థలతో విభేదించే స్వేచ్ఛకు సంబంధించిన అంశమని విద్యార్థులు పేర్కొన్నారు. తమ వృత్తి జీవితంపై భయం లేకుండా అధికారులతో విభేదించే స్వేచ్ఛ ఉండాలని అన్నారు. నల్సార్ విద్యార్థులు స్ఫూర్తివంతమైన ధైర్యసాహసాలు, నైతిక నిబద్ధత కనబరిచారని ప్రశంసించారు. వారికి బేషరతుగా సంఘీభావం తెలుపుతున్నామని అన్నారు.

## ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం



**పర్వతగిరి,ఆగస్టు16(తరంగాలు):** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి మాలోత్ శంకర్ నాయక్ మండల ప్రజలకు తెలిపారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి మాట్లాడుతూ...జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశాల మేరకు జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి గ్రామాల నుండి,తండాల నుండి ప్రజలు ప్రతి సోమవారం సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రానికి వెళ్లి ఇబ్బంది పడకుండా ఉండేందుకు కోసమే ప్రజల సమస్యల పరిష్కారం కోసం మండల కేంద్రంలోనే ప్రజావాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి,మండల పరిధిలోని గ్రామాల ప్రజల సమస్యలను పరిష్కారం చేసే విధంగా ప్రతి సోమవారం మండల కేంద్రంలో ప్రజావాణి నిర్వహించి ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా ప్రజావాణి కార్యక్రమం ఉపయోగపడుతుందని అన్నారు.మండల ప్రజలు తమ సమస్యలు,వినతులు,అభ్యర్థనలను ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత అధికారులకు నేరుగా దరఖాస్తులు అందజేయవచ్చునని,ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖ అధికారులు పరిశీలించి,నిబంధనల మేరకు సమస్యలకు తక్షణ పరిష్కార మార్గం చూపుతారని తెలుపుతూ,ఈ కార్యక్రమాన్ని మండలంలోని 33 గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మాలోత్ శంకర్ నాయక్ అన్నారు.ల

## ఆడపడుచు పెళ్లికి ఏజేఆర్ ఫౌండేషన్ పెళ్లి కానుక



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి ఆగస్టు 16 తరంగాలు**
పహిల్వాన్ పూర్ గ్రామానికి చెందిన రాయగిరి శిరీష వెంకటేష్ గౌడ్ కుమార్తె శ్రీజ వివాహ వేడుక లో దేవిశ్రీ గార్డెన్ ఫంక్షనల్లో కుటుంబ సభ్యులకి ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి 10 వేల రూపాయలు వారి కుటుంబ సభ్యులకి అందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు,గ్రామ యువత,తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి మండల పరిషత్ లో ప్రజావాణి

- ఉదయం 10 గంటల నుంచి
- మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహణ
- మండల ప్రజలు తమ సమస్యలు,
- దరఖాస్తులను అందజేయాలి
- ఎంపీడీఓ తాటిపాముల జస్వంత్ కుమార్

***పాలేరు ఆర్సీ, ఆగస్టు16 (తరంగాలు ) :*** కూసుమంచి మండలంలోని గ్రామాల నుండి అర్జీలు సమర్పించే ప్రజల సౌకర్యార్థం ప్రజా సమస్యలను మండల స్థాయిలోనే తెలుసుకొని పరిష్కరించే ఉద్దేశ్యంతో నేటి నుండి (ఆగస్టు 17వ తేదీ నుంచి) ప్రతి సోమవారం జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించ నున్నట్లు ఎంపీడీఓ జస్వంత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించ నున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగుతుందని ఎంపీడీఓ తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యలు, వినతులు, దరఖాస్తులను మండల స్థాయిలోని ప్రజావాణిలో సంబంధిత అధికారులకు అందజేయాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలు, దరఖాస్తులు మండల స్థాయిలోనే ప్రజావాణి ద్వారా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. మండల స్థాయిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలించి, నిబంధనల మేరకు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో పేర్కొన్నారు.



# దుగ్యాల సేవలు చిరస్మరణీయం



**తొర్రూరు తరంగాలు ,ఆగస్టు16**
మాజీ ఎమ్మెల్యే దుగ్యాల శ్రీనివాసరావు పాలకుర్తి (పాత చెన్నూరు) నియోజకవర్గానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రామసహాయం కృష్ణ కిషోర్ రెడ్డి అన్నారు.దుగ్యాల శ్రీనివాసరావు 62వ జయంతి సందర్భంగా దుగ్యాల శ్రీనివాసరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పాలకుర్తి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, కీర్తిశేషులు దుగ్యాల శ్రీనివాసరావు 62వ జయంతిని పురస్కరించుకొని ఆదివారం విశ్రాంతి భవన్‌లో మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు వెల్తూరి మల్లేశం, మిట్టకోల లక్ష్మణ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుగ్యాల ప్రజలకు విశేష సేవలందించడంతో పాటు ప్రతి వ్యక్తిని గుర్తుపట్టి ఆప్యాయంగా పలకరించే వారని అన్నారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ, కార్యకర్తల కుటుంబాలతో కూడా ఆత్మీయ బంధాన్ని కొనసాగించిన మహోన్నత నాయకుడని కొనియాడారు. ఆయన జీవితం సేవా స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకమని పేర్కొన్నారు.దుగ్యాల శ్రీనివాసరావు పాత చెన్నూరు నియోజకవర్గంలో కేవలం 15 రోజుల్లోనే ప్రజల మన్ననలు పొంది ఎమ్మెల్యేగా విజయం సాధించారని తెలిపారు. 2006 నుంచి 2009 వరకు నెల్లికుదురు, నర్సింహులపేట, తొర్రూరు, పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారని గుర్తుచేశారు. రైతులకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు కృషి చేశారని తెలిపారు. “విద్యతోనే దేశ భవిష్యత్తు నిర్మించబడుతుంది” అనే ఆలోచనతో నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పాఠశాల ఉండాలని విద్యార్థులు చెట్ల కింద చదువుకునే పరిస్థితి ఉండకూడదనే లక్ష్యంతో అదనపు తరగతి గదులను మంజూరు చేయించి విద్యాభివృద్ధికి విశేష కృషి చేశారని అన్నారు.తొర్రూరు పట్టణంలో ఉన్నత విద్య అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కూడా ఆయన కృషి చేశారని గుర్తుచేశారు. పాలకుర్తి శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా గుట్టపైకి సీసీ రోడ్డు నిర్మాణానికి కృషి చేశారని తెలిపారు. అంగన్వాడీ భవనాల నిర్మాణం, అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు.
నెల్లికుదురు--బొడ్లాడ--బ్రాహ్మణ కొత్తపల్లి మధ్య ఆకేరు వాగుపై వంతెన నిర్మాణానికి కృషి చేసి, ఆయా ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యాన్ని మెరుగుపరిచారని తెలిపారు.దుగ్యాల శ్రీనివాసరావు ఆశయాలను కొనసాగించి ఆయన జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దుగ్యాల శ్రీనివాసరావు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు వెల్తూరి మల్లేశం, మిట్టకోల లక్ష్మణ్ లను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎం.డి.అమీర్, సోమ హరిప్రసాద్,కృష్ణ,రవి, మంద యాకమల్లు, అశోక్ రెడ్డి, వినోద్ రెడ్డి, అంజన్న, దుగ్యాల అభిమానులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాస్ఫూర్తికి ప్రతీకగా నిలిచిన గ్రామీణ 5కే పరుగు



**పర్వతగిరి, ఆగస్టు 16(తరంగాలు):** యువతలో ఆరోగ్య చైతన్యం, దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం, క్రీడాస్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామంలోని ఆర్డీఎఫ్--వనితా అచ్చుతా పాయి విద్యాలయ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన “స్వామి వివేకానంద రన్--కల్లెడ (రన్ ఫర్ నేషన్-- విలేజ్ ఎడిషన్)” 5 కిలోమీటర్ల స్నేహపూర్వక పరుగు పందెం ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా ముగిసింది. పరుగులో ఆరోగ్యం.. ఆరోగ్యంలో విజయం..యువతలో దేశభక్తి అనే సందేశంతో నిర్వహించిన ఈ ప్రత్యేక 5కే రన్ గ్రామీణ ప్రాంతంలో ఆరోగ్యం, క్రీడలపై చైతన్యం కల్పిస్తూ అందరి ప్రశంసలు అందుకుంది.ఈకార్యక్రమంలో విద్యార్థులు ,యువత ,క్రీడాకారులు, గ్రామీణ ప్రజలు కలిపి సుమారు 220 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు.కల్లెడలోని కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ప్రారంభ కార్యక్రమానికి కల్లెడ గ్రామ సర్పంచ్ తక్కలపల్లి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై జెండా ఊపి 5కే రన్‌ను ప్రారంభించారు. కల్లెడ నుంచి ప్రారంభమైన పరుగు బూరుగుమళ్ల హైస్కూల్ వరకు సుమారు 5 కిలోమీటర్ల మేర కొనసాగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ స్వామి వివేకానంద ఆశయాలను యువత ఆచరణలో పెట్టాలని సూచించారు. ఆరోగ్యకరమైన జీవనశైలి,దేశభక్తి, క్రమశిక్షణ,సేవాభావం,నాయకత్వ లక్షణాలు,క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. పరుగులో ప్రతిభ కనబరిచిన విజేతలకు బూరుగుమళ్ల సర్పంచ్ ఎలికంటి కృష్ణవేణితో పాటు ముఖ్య అతిథులు ప్రశంసాపత్రాలు, ఆకర్షణీయమైన మెడల్స్ అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆడెపు జనార్ధన్,ఏఓ సతీష్,ఫిజికల్ డైరెక్టర్ బర్ల రాజు, 5కే రన్ ఇన్‌చార్జి బిందు, అధ్యాపకులు సంతోష్,గుంషావళి,మహేశ్వర్,వేణు,సిబ్బంది, విద్యార్థులు,యువత, క్రీడాకారులు,గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మద్యం తాగి వాహనాలు నడపవద్దు ఎస్సై

**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్చి ఆగస్టు 16 తరంగాలు**
వలిగొండ మండల కేంద్రంలో ఆదివారం ద్విచక్ర వాహనాలు తనిఖీలు భాగంగా ప్రయాణికులుద మద్యం తాగి ఎవరైనా వాహనాలు నడిపి తద్వారా పోలీసులకు పట్టుబడినట్లైతే 10 వేల రూపాయలు జరిమానా లేదా జైలు శిక్ష విధిస్తారని, కాబట్టి ప్రజలందరూ కూడా చట్టానికి లోబడి నడుచుకుంటూ ఎవరు కూడా మద్యం తాగి వాహనాలు నడపవద్దని ఎస్సై శ్రీకాంత్ రెడ్డి తెలియజేశారు.



# ట్యాంకర్ల నుంచి రసాయనాలు దారి మళ్లింపు

• ఐదుగురు అరెస్ట్



**నల్గొండ, ఆగస్టు 16 (తరంగాలు):** చిట్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెలిమినేడు గ్రామ శివారులో పారిశ్రామిక రసాయనాలను అక్రమంగా దారి మళ్లించి నిల్వ చేసి విక్రయిస్తున్న ముఠాను చిట్యాల పోలీసులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారంతో రాజస్థాన్ ధాబా వెనుక పార్కింగ్ స్థలంలో అనుమానాస్పదంగా నిలిపిన వాహనాలను తనిఖీ చేయగా అక్రమ రసాయనాల దందా వెలుగులోకి వచ్చింది.పోలీసుల వివరాల ప్రకారం.. జాతీయ రహదారి-65పై రవాణా అయ్యే రసాయన ట్యాంకర్ల డ్రైవర్లతో కుమ్మక్కైన నిందితులు ట్యాంకర్లలోని సాల్వెంట్లు, ఐసోప్రొపైల్ ఆల్కహాల్, మిథనాల్ తదితర పారిశ్రామిక రసాయనాలను గమ్యస్థానానికి పూర్తిగా చేర్చకుండా కొంత భాగాన్ని అక్రమంగా బయటకు తీసేవారు. వాటిని తక్కువ ధరకు కొనుగోలు చేసి ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నిల్వ చేసి హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తూ అక్రమ లాభాలు పొందుతున్నట్లు దర్యాప్తులో తేలింది.ఈ కేసులో ప్రధాన నిందితుడు చాపల సత్యనారాయణ అలియాస్ సతీష్‌తో పాటు బిపిన్ కుమార్ యాదవ్, నవీన్ కుమార్, రాకేష్ ప్రసాద్, అమిత్ కుమార్‌లను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి పారిశ్రామిక రసాయనాలతో నింపిన పలు ప్లాస్టిక్ డ్రమ్ములు, రసాయనాలను తరలించేందుకు ఉపయోగించిన పైపులు, ఇతర పరికరాలు, ట్యాంకర్లకు సంబంధించిన ఇన్వాయిసులు, రవాణా పత్రాలు, ఇతర రికార్డులను స్వాధీనం చేసుకున్నారు.రవాణా కోసం అప్పగించిన పారిశ్రామిక రసాయనాలను అక్రమంగా దారి మళ్లించి విక్రయించడం ద్వారా సంబంధిత పరిశ్రమలకు ఆర్థిక నష్టం కలిగించినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు అనంతరం న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు వారిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించింది.ఈ అక్రమ రవాణా, విక్రయాల వెనుక మరికొందరి ప్రమేయం ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ వివరాలను నార్కెట్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వెల్లడించారు.

# క్రికెట్ ప్లేయర్ విశ్వనాథ్ వైష్ణవ్ కుటుంబాన్ని పరామర్శించిన ఎర్రబెల్లి ప్రదీప్ రావు



**వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 16,తరంగాలు** : క్రికెట్ ప్లేయర్ విశ్వనాథ్ వైష్ణవ్ కుటుంబాన్ని ఎర్రబెల్లి ప్రదీప్ రావు పరామర్శించారు.వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని కరీమాబాద్ ఎస్ఆర్ఆర్ తోట ప్రాంతానికి చెందిన వరంగల్ వారియర్ క్రికెట్ ప్లేయర్ విశ్వనాథ్ వైష్ణవ్ ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే రావు పద్మతో కలిసి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా విశ్వనాథ్ వైష్ణవ్ కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం వారి కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు.విశ్వనాథ్ వైష్ణవ్ మృతి క్రీడా రంగానికి, ఆయన కుటుంబ సభ్యులకు తీరని లోటని ఎర్రబెల్లి ప్రదీప్ రావు పేర్కొన్నారు. యువ క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు, కష్టాల్లో ఉన్న కుటుంబాలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు

# సీఎం సహాయ నిధి పేద ప్రజల ఆరోగ్య ప్రదాయిని

• అంబేద్కర్ నగర్ గ్రామ సర్పంచ్ చీటూరి రాజు



**వర్ధన్నపేట ప్రతినిధి,ఆగస్టు 15, తరంగాలు** : సీఎం సహాయ నిధి పేద ప్రజల వైద్య ఆరోగ్య ప్రదాయినిగా నిలుస్తుందని అంబేద్కర్ నగర్ గ్రామ సర్పంచ్ చీటూరి రాజు అన్నారు.వర్ధన్నపేట మండలం అంబేద్కర్ నగర్ గ్రామానికి చెందిన చట్ట అలెక్సుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.92,000 విలువైన రిలీఫ్ ఫండ్ చెక్కును గ్రామ సర్పంచ్ చీటూరి రాజు అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ చీటూరి రాజు మాట్లాడుతూ.. సీఎంఆర్ఎఫ్ పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల సమయంలో ఎంతో అండగా నిలుస్తుందని అన్నారు. ప్రభుత్వ సహాయాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో చింత బాబు, వార్డు సభ్యులు బంక సందీప్, యకరా సందీప్, యువజన సభ్యులు బంక సుధీర్, సింగరపు సుధీర్, బొక్కల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ పోలీస్ అధికారిగా వర్ధన్నపేట ఎస్ఐ సాయిబాబు

• విధి నిర్వహణలో ప్రతిభ.. ఎస్సై సాయిబాబుకు ఘన సత్కారం
• ప్రజలకు మెరుగైన సేవలందించినందుకు ప్రశంస
• కలెక్టర్,డీసీపీ,ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్న ఎస్ఐ



**వర్ధన్నపేట ప్రతినిధి, ఆగస్టు 15,తరంగాలు** : 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచి, పోలీస్ శాఖకు విశిష్ట సేవలు అందించిన వర్ధన్నపేట పోలీస్ స్టేషన్ ఎస్ఐ సాయిబాబును ఉత్తమ పోలీస్ అధికారిగా ఎంపిక చేసి ప్రశంసా పత్రం అందజేశారు.జనగామ డీసీపీ పరిధిలో విధి నిర్వహణలో చూపిన ప్రతిభ, ప్రజలకు అందించిన సేవలను గుర్తిస్తూ ఎస్ఐ సాయిబాబును ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, డీసీపీ రాజమహేంద్ర నాయక్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేతుల మీదుగా సాయిబాబు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా అధికారులు ఎస్ఐ సాయిబాబును అభినందిస్తూ, ఇదే స్ఫూర్తితో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మరింత మెరుగైన పోలీస్ సేవలు అందించాలని సూచించారు.80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ పోలీస్ అధికారిగా ప్రశంసా పత్రం అందుకోవడం పట్ల వర్ధన్నపేట పోలీస్ స్టేషన్ సిబ్బంది, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ ఎస్ఐ సాయిబాబుకు అభినందనలు తెలిపారు.

# దుఃఖంలో తోడుగా.. బాధిత కుటుంబానికి అండగా యువ నాయకుడు బిర్రు రాజు



**వర్ధన్నపేట ప్రతినిధి, ఆగస్టు 16,తరంగాలు :** వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామానికి చెందిన పైండ్ల కుమారస్వామి చింటూ అనారోగ్య కారణాలతో మృతి చెందడం తీవ్ర విషాదకరమని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు బిర్రు రాజు అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన బాధిత కుటుంబం నివాసానికి వెళ్లి, పైండ్ల యాదమ్మతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బాధిత కుటుంబం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న నేపథ్యంలో వారికి ధైర్యం చెబుతూ మానవతా దృక్పథంతో 50 కిలోల బియ్యం అందజేశారు. కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.అదేవిధంగా, వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు నల్లబెల్లి గ్రామానికి చెందిన తక్కలపల్లి మనోజ్‌కు రూ.1,14,000 విలువైన సీఎంఆర్ ఫండ్ చెక్కును పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో నల్లబెల్లి కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు తాటికాయల దిలీప్, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ముత్యం యాకన్న, వార్డు సభ్యులు ఎలబోయిన సదానందం, మరిపట్ల ప్రశాంత్, ఆరెల్లి నాగరాజు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బిర్రు చంద్రయ్య, అంబాల యాకాంత, పురుగుజ కవిత, బిర్రు గోపాల్, దుగ్యాల దేవేందర్ రావు, బొల్లపల్లి కుమారస్వామి, బిర్రు భాస్కర్, జనపరెడ్డి సంపత్ రెడ్డి, వడ్డే నారాయణ, తాటికాయల నాగరాజు, బొల్లెపల్లి యకాంబరం, తాటికాయల యాకాంత తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# వారమంతా కదలకుండా, వారాంతాల్లో క్రీడలు ఎక్కువగా ఆడుతున్నారా అయితే జాగ్రత్త

వీకెండ్ వచ్చిందంటే క్రికెట్, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్ లేదా ట్రెక్కింగ్‌కు వెళ్లడం చాలామందికి ఇష్టం. వారంలో ఎక్కువ సమయం డెస్క్ ముందు కూర్చుని పనిచేసే వారు కూడా శని, ఆదివారాల్లో ఒక్కసారిగా ఎక్కువ శారీరక శ్రమ చేస్తుంటారు. అయితే వారమంతా పెద్దగా కదలకుండా, ఒక్కసారిగా శరీరంపై అధిక ఒత్తిడి పెడితే క్రీడా గాయాల ముప్పు పెరుగుతుంది. ఆర్థోపెడిక్ క్లినిక్‌లకు వీకెండ్ తర్వాత వచ్చే అనేక కేసుల్లో ఇదే సాధారణ కారణంగా కనిపిస్తోంది. వీకెండ్ స్పోర్ట్స్ ఆడే వారిలో చాలామంది ఆరోగ్యంగా, చురుగ్గా ఉండే ఉద్యోగులే. సమస్య ఫిట్‌నెస్ పూర్తిగా లేకపోవడం కాదు.. వారంలో క్రమం తప్పకుండా శారీరక కదలికలు లేకపోవడమే. ఎక్కువసేపు కూర్చున్న తర్వాత ఒక్కసారిగా వేగంగా పరుగెత్తడం, దూకడం, మలుపులు తిరగడం, దిశ మార్చడం వంటి కదలికలు చేస్తే కండరాలు, టెండన్లు, లిగమెంట్లు, కీళ్లపై అధిక ఒత్తిడి పడుతుంది. ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్ వంటి క్రీడల్లో ఒక్కసారిగా దిశ మార్చడం వల్ల మోకాలిపై ఎక్కువ ఒత్తిడి పడుతుంది. ముఖ్యంగా ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్‌లో ఏసీఎల్ వంటి మోకాలి లిగమెంట్ గాయాలు సంభవించే అవకాశం ఉంటుంది. బ్యాడ్మింటన్, టెన్నిస్ వంటి చేతులను పైకి ఎత్తి ఆడే క్రీడల్లో భుజంలోని రొటేటర్ కఫ్‌పై ఒత్తిడి పెరిగి స్ట్రెయిన్ వస్తుంది. రన్నింగ్, ట్రెక్కింగ్ సమయంలో అసమతలమైన నేలపై అడుగు తప్పితే చీలమండ బెణికే అవకాశం ఉంటుంది.

### మునుపటి సామర్థ్యం ఉండదు..

ఈ గాయాలు రావడానికి తప్పనిసరిగా పెద్దగా పడిపోవడం లేదా ఎవరికైనా ఢీకొనడం అవసరం లేదు. ఒక్కసారిగా మలుపు తిరగడం, సరిగ్గా ల్యాండ్ కాకపోవడం లేదా అలసట వచ్చిన తర్వాత కూడా మరోసారి అదే కదలిక చేయడం వల్ల కూడా గాయం సంభవిస్తుంది. వయస్సు పెరిగేకొద్దీ ఈ సమస్య మరింత స్పష్టంగా కనిపిస్తుంది. ముఖ్యంగా 30ల చివరి దశ, 40లలో ఉన్న చాలామంది చిన్నతనంలో క్రికెట్, బ్యాడ్మింటన్ లేదా ఫుట్‌బాల్ ఆడినప్పటికీ ఉద్యోగం, కుటుంబ బాధ్యతల కారణంగా క్రమం తప్పకుండా ఆడటం మానేస్తారు. తర్వాత ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టి మళ్లీ అదే క్రీడలను ఉత్సాహంగా ప్రారంభిస్తారు. అయితే అప్పటితో పోలిస్తే శరీర సామర్థ్యంలో మార్పులు వచ్చి ఉంటాయి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయకపోతే కండరాల బలం, వశ్యత, కీళ్ల స్థిరత్వం తగ్గుతుంది. వయసు పెరిగేకొద్దీ శరీరం కోలుకునే సమయం కూడా ఎక్కువ అవుతుంది. అందువల్ల చాలా కాలం తర్వాత ఒక్కసారిగా అధిక తీవ్రతతో క్రీడలు ఆడితే గాయాల ముప్పు పెరుగుతుంది. అందుకే మళ్లీ స్పోర్ట్స్ ప్రారంభించాలనుకునే వారు నేరుగా పూర్తి వేగంతో ఆటలోకి దిగకుండా క్రమంగా శరీరాన్ని సిద్ధం చేసుకోవాలి. కండరాల బలం, సమతుల్యత, కదలిక సామర్థ్యాన్ని నెమ్మదిగా పెంచుకుంటే గాయాల ముప్పును తగ్గించుకోవచ్చు.

### వార్మప్ తప్పనిసరి..

వీకెండ్ స్పోర్ట్స్‌కు ముందు వార్మప్ చేయకపోవడం కూడా సాధారణంగా కనిపించే తప్పుల్లో ఒకటి. బుక్ చేసుకున్న కోర్టు లేదా ఆట సమయాన్ని పూర్తిగా ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతో కొందరు నేరుగా ఆట ప్రారంభిస్తారు. కానీ ఒక్కసారిగా పరుగెత్తడం, దూకడం, దిశ మార్చడం వంటి కదలికలకు ముందు కండరాలు, కీళ్లను సిద్ధం చేయడానికి కొంత సమయం కేటాయించడం అవసరం. ఆటకు ముందు కొన్ని నిమిషాల డైనమిక్ వార్మప్ శరీరాన్ని సిద్ధం చేయడంలో సహాయపడుతుంది. మరో ముఖ్యమైన అంశం స్ట్రెంగ్త్ ట్రైనింగ్ లేకపోవడం. క్రీడల్లో మోకాళ్లు, తుంటి, చీలమండలు, భుజాలపై పదేపదే ఒత్తిడి పడుతుంది. సాధారణ ఫిట్‌నెస్ ఉన్నంత మాత్రాన ఈ కీళ్లకు అవసరమైన బలం, స్థిరత్వం ఉన్నట్టుకాదు. కాళ్లు, కోర్ కండరాలకు క్రమం తప్పకుండా బలం పెంచే వ్యాయామాలు చేస్తే ఆట సమయంలో బ్యాలెన్స్, కంట్రోల్, శరీర స్థిరత్వం మెరుగుపడతాయి. ఆటలో నొప్పి వచ్చినా పట్టించుకోకుండా కొనసాగించడం కూడా ప్రమాదకరమే. వ్యాయామం తర్వాత స్వల్పంగా కండరాల నొప్పి రావడం సాధారణం అవుతుంది. కానీ కదిలినప్పుడు నొప్పి పెరగడం, వాపు రావడం లేదా ఆటతీరు ప్రభావితం కావడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదు.

# ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన







• వాగ్గు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

• వాగ్గు ఫౌండేషన్ సేవలు అభినందనీయం - బేతి అశోక్ బాబు

**వరంగల్ ప్రతినిధి , ఆగస్టు 16, తరంగాలు :** వాగ్గు ఫౌండేషన్ ఆధ్వర్యంలోనిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని,వాగ్గు ఫౌండేషన్ సేవలు అభినందనీయమని బేతి అశోక్ బాబు అన్నారు.వాగ్గు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వరంగల్ ఖమ్మం రోడ్‌లోని వాల్‌మార్ట్ ఎదురుగా ఉన్న ఓరుగల్లు ఐ హాస్పిటల్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ శైలజ, వాగ్గు రోహిణి, వాగ్గు దీపిక ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ శిబిరం కొనసాగింది.డా. వాగ్గు శ్రీకుమార్ , ప్రొఫెసర్ ఆఫ్ ఆప్తాల్మాలజీ, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల, వరంగల్ ఆధ్వర్యంలో ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించారు. నేత్ర సంబంధిత వైద్య సేవలతో పాటు అవసరమైన వారికి మందులు, కంటి చుక్కలను ఉచితంగా అందించారు. శిబిరానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గడ్డం భాస్కర్, రిటైర్డ్ ప్రొఫెసర్ గుండు ప్రభాకర్, బేతి అశోక్ బాబు, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్ బాసాని శ్రీనివాస్, డి. ఆనంద్, న్యాయవాది శివశంకర్, డాక్టర్ జగదీష్, సీపీ అఖిల్, పాటల రవి, బూరుగుపల్లి శ్రీనివాస్, అమర్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బేతి అశోక్ బాబు మాట్లాడుతూ.. కంటి ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా నేత్ర పరీక్షలు, వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. వాగ్గు ఫౌండేషన్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన ప్రశంసించారు.ప్రజలకు ఉపయోగపడే విధంగా ఇలాంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు. "విజన్ నుంచి వికాసం.. మానవ సేవే లక్ష్యం" అనే ఆశయంతో వాగ్గు ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోందని పేర్కొన్నారు.

THARANGALU DAILY NEWS
సోమవారం , 17 ఆగస్టు , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# బాలాజీ నగర్‌లో ముత్యాలమ్మ తల్లికి ఘనంగా బోనాలు





**ఇల్లందు, ఆగస్టు 16 (తరంగాలు):** శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఇల్లందు మండలం బాలాజీనగర్ గ్రామపంచాయతీ మూడో వార్డు ప్రజలు ముత్యాలమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. మహిళలు బోనాలను తలపై ఎత్తుకుని మేళతాళాల నడుమ పురవీధుల గుండా ఊరేగింపుగా ముత్యాలమ్మ తల్లి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, ముత్యాలమ్మ తల్లి దీవెనలు ప్రతి ఒక్కరిపై ఉండాలని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు పాయం వెంకన్న, సూర్ణపాక హనుమంతు, చీమల మల్లేష్, వార్డు మెంబర్ అఖిల్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో మూడో వార్డు ప్రజలు ముత్యాలమ్మ తల్లికి అత్యంత ఘనంగా, భక్తిశ్రద్ధలతో బోనాల మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజల ఐక్యత, భక్తి భావాలకు బోనాల ఉత్సవం ప్రతీకగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మచ్చ రామారావు, ఊకే బుచ్చయ్య, మెస్సు ఉపేందర్, కుక్కముడి మహేష్, ఊకే రఘు, పూజారి మొగిలి వెంకటేశ్వర్లు, ఈసం పాపమ్మ, మూతి రామకళ, మోకాళ్ల సింగమ్మ, ఊకే అనసూర్య, ఈసం కనకమ్మతో పాటు మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# సగం వాన.. సగం ఆట..





- తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 460/9
- రెండో రోజు పుంజుకున్న లంక స్పిన్నర్లు
- మెరిసిన ప్రభాత్, నువాంత
- ఆదుకున్న జురెల్

గాలె : శ్రీలంకతో గాలెలో జరుగుతున్న తొలి టెస్టులో మొదటి రోజు రాణించిన భారత బ్యాటర్లు రెండో రోజు తడబడ్డారు. దేవ్‌దత్ పడిక్కల్ (230 బంతుల్లో 15 ఫోర్లు, 1 సిక్స్‌తో 167) జోరును కొనసాగించినా ధృవ్ జురెల్ (68 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 51) మినహా మిగిలిన బ్యాటర్లు తేలిపోవడంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి టీమిండియా 460/9తో నిలిచింది. వర్షం కారణంగా 43 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైన మ్యాచ్‌లో భారత్.. 112 రన్స్ చేసి 7 వికెట్లు కోల్పోయింది. మొదటి రోజు అంతగా ప్రభావం చూపని లంక స్పిన్నర్లు ప్రభాత్ జయసూర్య (4/109), నువాంత కేశర (3/175) పిచ్ పరిస్థితులను సద్వినియోగం చేసుకుని చెలరేగి గిల్ సేనను కట్టడిచేయడంలో సఫలీకృతమయ్యారు.

### స్పిన్నర్ల జోరు

288/2తో రెండో రోజు ఇన్నింగ్స్‌ను మొదలెట్టిన భారత్.. ఆరంభంలోనే రిషభ్ పంత్ (39) వికెట్ కోల్పోయింది. నువాంత బౌలింగ్‌లో భారీ షాట్ ఆడబోయిన పంత్.. టైమింగ్ మిస్ అవడంతో మిడాఫ్ వద్ద దినుష అద్భుతమైన డైవ్ క్యాచ్‌తో వెనుదిరిగాడు. తొలి రోజు కండరాలు పట్టేడయంతో క్రీజు వదిలిన కేఎల్ రాహుల్ (82).. పంత్ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చినా అతడు నాలుగు పరుగులు మాత్రమే జోడించి కేశర బౌలింగ్‌లో షార్ట్‌లెగ్ వద్ద నిషాన్ చేతికి చిక్కాడు. మరో ఎండ్‌లో ఫస్ట్ ఇన్నింగ్స్ జోరును కొనసాగించిన పడిక్కల్.. అసిత ఫెర్నాండో బౌలింగ్‌లో బౌండరీతో 150 మార్కును చేరుకున్నాడు. కానీ కొద్దిసేపటికే జయసూర్య బౌలింగ్‌లో ముందుకొచ్చి ఆడబోయి స్టంపౌట్ అయ్యాడు. సీనియర్ బ్యాటర్ రవీంద్ర జడేజా (13) ఆదుకుంటాడని భావించినా కేశర మరోసారి మాయ చేసి అతడికి చెక్ పెట్టాడు. టీ విరామం తరవాత అతడు.. జడ్డూను ఎల్బీగా వెనక్కి పంపడంతో భారత్ ఆరో వికెట్ కోల్పోయింది.

### ఆదుకున్న జురెల్

లంక స్పిన్నర్లు విజృంభిస్తుండటంతో వెంటవెంటనే వికెట్లు కోల్పోయిన భారత్‌ను జురెల్, మానవ్ సుతార్ (24) ఆదుకున్నారు. నిలకడగా ఆడిన ఈ జోడీ.. లంక స్పిన్ ద్వయాన్ని నిలువరించి ఏడో వికెట్‌కు 66 బంతుల్లోనే 55 రన్స్ జోడించి భారత్‌ను మెరుగైన స్థితిలో నిలిపింది. లాహిరు ఓవర్లో జురెల్ రెండు బౌండరీలు బాదగా, మానవ్ ఓ ఫోర్ కొట్టడంతో భారత్ 400 రన్స్ మార్కును దాటింది. నువాంత ఓవర్లో డబుల్‌తో 66 బంతుల్లో అర్ధశతకాన్ని అందుకున్న జురెల్.. జయసూర్య బౌలింగ్‌లో స్లిప్స్ వద్ద కెప్టెన్ ధనంజయ సూపర్ క్యాచ్‌తో ఔట్ అయ్యాడు. జురెల్ నిష్క్రమణ అనంతరం సిరాజ్ (11), మానవ్ కూడా పెవిలియన్ చేరడంతో భారత్ రెండో రోజే ఆలౌట్ అవుతుందా? అనిపించింది. కానీ కుల్‌దీప్ (12 బ్యాటింగ్), ప్రసిద్ధ్ (1 బ్యాటింగ్) లంకకు ఆ అవకాశాన్నివ్వలేదు.

### తొలి సెషన్ వర్షార్పణం

రెండో రోజు వర్షం కారణంగా తొలి సెషన్ తుడిచిపెట్టుకుపోయింది. గాలెలో ఆదివారం ఉదయం నుంచే మొదలైన వాన.. ఆగుతూ, కురుస్తూ ఆటకు తీవ్ర అంతరాయం కల్గించింది. ఎట్టకేలకు మధ్యాహ్నానికి వరుణుడు శాంతించినా వెట్ ఔట్‌ఫీల్డ్‌తో పాటు వెలుతురు లేమి కారణంగా ఆట సాధ్యమవలేదు. సుదీర్ఘ నిరీక్షణ అనంతరం మధ్యాహ్నం 2.30 గంటలకు మ్యాచ్ ఆరంభమైంది.

## భళా బంగ్లా.. తొలి టెస్టులో ఆస్ట్రేలియాపై చరిత్రాత్మక విజయం

డార్విన్ : రెండు దశాబ్దాల తర్వాత (23 ఏండ్లు) ఆస్ట్రేలియా లో టెస్టు ఆడేందుకు వెళ్లిన బంగ్లాదేశ్ చరిత్ర సృష్టించింది. హేమాహేమీలతో కూడిన ఆసీస్‌ను సొంతగడ్డపై ఓడించి చరిత్రాత్మక విజయాన్ని నమోదుచేసింది. 'అసలు మీరు మూడు రోజులైనా ఆడతారా?' అని కంగారూ మీడియా గేలి చేసినా వారికి గెలుపుతోనే దిమ్మతిరిగిపోయే సమాధానమిచ్చి ంది. డార్విన్ వేదికగా నాలుగు రోజుల్లోనే ముగిసిన తొలి టెస్టులో బంగ్లా.. ప్రత్యర్థిపై 9 వికెట్ల తేడాతో నెగ్గి తమ క్రికెట్ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ విజయాన్ని సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో కామెరూన్ గ్రీన్ (104) సెంచరీతో ఆదుకున్నా ఆస్ట్రేలియాను 284 రన్స్‌కే కట్టడిచేసిన పర్యాటక జట్టు.. కంగారూలను తమ ఎదుట నిలిపిన 57 పరుగుల నామమాత్రపు లక్ష్యాన్ని ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించింది. మెహిదీ హసన్ మిరాజ్ (5/66) ఐదు వికెట్ల ప్రదర్శనతో ఆసీస్ పతనాన్ని శాసించాడు. ఆస్ట్రేలియా గడ్డపై టెస్టుల్లో బంగ్లాకు ఇదే తొలి విజయం కాగా ఓవరాల్‌గా రెండోది. ఈ మ్యాచ్‌లో 9 వికెట్లు పడగొట్టిన బంగ్లా యువ పేసర్ హసన్ మహ్మద్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

మిరాజ్ మాయకు కుదేలు..

ఓవర్ నైట్ స్కోరు 161/4తో నాలుగో రోజు ఆరంభించిన ఆసీస్‌కు తొలి సెషన్‌లోనే మిరాజ్ చుక్కలు చూపించాడు. మొదట కేరీ (30)ని బుట్టలో వేసుకున్న అతడు.. ఆ తర్వాత వెబ్‌స్టర్ (5)నూ బోల్తా కొట్టించాడు. అదే ఊపులో కెప్టెన్ పాట్ కమిన్స్ (8)నూ బోల్తా కొట్టించి కంగారూలు కోలుకోకుండా చేశాడు. మరో ఎండ్‌లో గ్రీన్ పోరాడుతున్నా అతడికి సాయమందించేవారు కరువయ్యారు. స్టార్క్ (18) కొంతసేపు ప్రతిఘటించినా లంచ్ తర్వాత టస్కిన్ అతడికి చెక్ పెట్టాడు. గ్రీన్ శతకం చేశాక హసన్ ఓవర్లో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. లియాన్ (15)ను ఔట్ చేసిన మిరాజ్ ఐదో వికెట్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు.

## అమ్మాయిల పోరు డ్రా



అమ్‌స్టెల్‌వీన్ (నెదర్లాండ్స్) : హాకీ ప్రపంచకప్‌లో టైటిల్ వేటను భారత మహిళల జట్టు డ్రాతో ఆరంభించింది. పూల్-డీలో భాగంగా ఆదివారం ఇక్కడ ఉత్కంఠగా జరిగిన మ్యాచ్‌లో భారత్.. చైనాతో పోరును 2-2తో డ్రాగా ముగించింది. మూడో క్వార్టర్ దాకా మ్యాచ్‌లో ఆధిక్యం సాధించి గెలుపు దిశగా సాగిన మన అమ్మాయిలు.. ఆ తర్వాత ప్రత్యర్థికి గోల్ సమర్పించుకుని డ్రాతో సంతృప్తిపడాల్సి వచ్చింది. భారత్ తరఫున నవ్‌నీత్ కౌర్ (8వ నిమిషంలో), దీపికా (26వ) గోల్స్ చేయగా చైనా నుంచి ఝూంగ్ యింగ్ (14వ), మా నింగ్ (39వ) గోల్స్ సాధించారు. తర్వాతి మ్యాచ్‌లో భారత్ ఈనెల 18న దక్షిణాఫ్రికాతో తలపడనుంది. కాగా పురుషుల విభాగంలో భారత్.. తమ రెండో మ్యాచ్‌లో సోమవారం ఇంగ్లండ్‌తో ఆడనుంది.

## టార్గెట్ సిక్స్.. నేటి నుంచే బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ చాంపియన్‌షిప్స్

**ఆరో పతకంపై సింధు గురి**



ఢిల్లీ : దేశ రాజధాని మరో మెగా ఈవెంట్‌కు సిద్ధమైంది. బ్యాడ్మింటన్ అభిమానులు వేయి కండ్లతో ఎదురుచూస్తున్న ప్రతిష్టాత్మక బ్యాడ్మింటన్ వరల్డ్ చాంపియన్‌షిప్స్ (బీడబ్ల్యూఎఫ్) టోర్నీ నేటి నుంచి ఢిల్లీలోని ఇందిరా గాంధీ స్టేడియంలో మొదలవనుంది. 17 ఏండ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో అత్యంత విజయవంతమైన షట్లర్‌గా పేరుగాంచిన తెలుగు తేజం పీవీ సింధు రికార్డు స్థాయిలో ఆరో పతకంపై గురిపెట్టింది.
ఈ టోర్నీలో ఒక స్వర్ణం (2019)తో పాటు రెండేసి రజతాలు (2017, 2018), కాంస్యాలు (2013, 2014) గెలిచిన సింధు.. ఆరోదీ నెగ్గి సరికొత్త చరిత్రను లిఖించాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతున్నది. సింధుతో పాటు భారత డబుల్స్ ద్వయం సాత్విక్-చిరాగ్ జోడీ మూడో పతకంపై కన్నేయగా మహిళల సింగిల్స్‌లో యువ సంచలనం ఉన్నతి హుడా, మెన్స్ సింగిల్స్‌లో లక్ష్యసేన్, ఆయుష్ పతకాల రేసులో ఉన్నారు. మొత్తం ఐదు విభాగాల్లో పది మంది బృందంతో భారత్ బరిలోకి దిగనున్నది. 2011 నుంచి ఈ టోర్నీలో కనీసం ఒక్క పతకమైనా గెలిచిన భారత్.. ఆ రికార్డును నిలబెట్టుకుని సొంతగడ్డపై సత్తాచాటాలని భావిస్తున్నది.

### సింధు సాధిస్తుందా?

2019 ఎడిషన్‌లో స్వర్ణం గెలిచిన సింధు.. ఈసారి సొంతగడ్డపై ఈ టోర్నీలో మరెవరికీ సాధ్యం కాని విధంగా సిక్స్ మెడల్‌ను దక్కించుకోవాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతున్నది. ఈ టోర్నీ చరిత్రలో చైనా షట్లర్లు లిన్ డాన్ (పురుషుల విభాగంలో ఐదు స్వర్ణాలు), ఝూ యున్లీ (మూడు మిక్స్‌డ్ డబుల్స్, రెండు ఉమెన్స్ డబుల్స్) మాత్రమే ఐదేసి పతకాలు సాధించినవారిలో ఉన్నారు. ఈసారి సింధు మెడల్ గెలిస్తే సరికొత్త చరిత్ర సృష్టిస్తుంది. అయితే గత కొన్నాళ్లుగా ఫామ్, ఫిట్‌నెస్, గాయాలతో సతమతమై సరైన ప్రదర్శన చేయలేకపోయినా జులైలో ముగిసిన జపాన్ ఓపెన్‌లో టైటిల్ నెగ్గడం సింధూలో ఉత్సాహాన్ని నింపింది. స్థాయికి తగ్గ ప్రదర్శన చేస్తే ఆమె సెమీస్ వరకూ తన ప్రయాణాన్ని సాఫీగానే సాగించొచ్చు. తొలి రౌండ్‌లో ఐర్లాండ్‌కు చెందిన సోఫియా నోబుల్‌తో తలపడనున్న ఈ డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్.. అక్కడ ముందంజ వేస్తే ప్రిక్వార్టర్స్‌లో మూడో సీడ్ వాంగ్ జి యి (చైనా)తో, క్వార్టర్స్‌లో ఇండోనేషియా షట్లర్ పుత్రి కుసుమను ఎదుర్కొంటుంది. క్వార్టర్స్‌ను అధిగమిస్తే సెమీస్‌లో ఒలింపిక్ చాంపియన్, టాప్ సీడ్ అన్ సె యాంగ్ (దక్షిణ కొరియా)తో ఆడాల్సి రావొచ్చు. మరి సింధు ఆరో పతకాన్ని సాధిస్తుందా? లేదా? అనేది త్వరలో తేలనుంది.

## ఫైనల్లో కంగుతిన్న సన్‌రైజర్స్.. హండ్రెడ్ ట్రోఫీని ముద్దాడిన ట్రెంట్ రాకెట్స్..!



మహిళల హండ్రెడ్ లీగ్‌లో కొత్త ఛాంపియన్ అవతరించింది. లార్డ్స్ వేదికగా ఆదివారం జరిగిన ఫైనల్లో జయభేరి మోగించిన ట్రెంట్ రాకెట్స్ (టీఆర్ =టీఎస్ఎం) తమ కలను సాకారం చేసుకుంది. లీగ్ దశలో దుమ్మురేపిన సన్‌రైజర్స్ లీడ్స్(ాబఅతీఱంవపతీం ావపవం)ను టైటిల్ పోరులో 91 పరుగులకే కట్టడి చేసిన రాకెట్స్.. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది. ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన ఆష్లే గార్డ్‌నర్ సారథ్యంలోని రాకెట్స్ ది హండ్రెడ్ ట్రోఫీని ఎగరేసుకుపోయింది.ఇంగ్లండ్ గడ్డపై నిర్వహించిన మహిళల హండ్రెడ్ లీగ్ 2026 టైటిల్‌ను ట్రెంట్ రాకెట్స్ ఒడిసిపట్టింది. లార్డ్స్ మైదానంలో ఏకపక్షంగా జరిగిన ఫైనల్లో సన్‌రైజర్స్ లీడ్స్‌పై భారీ విజయంతో ఛాంపియన్‌గా అవతరించింది రాకెట్స్.